క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులు విధులు బహిష్కరణ



వేమూరు:గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మూడు నెలల నుంచి జీతాలు చెల్లించక పోవడంతో విధులు బహిష్కరించడం జరిగింది. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు 14 మంది పని చేస్తున్నారు. మూడు నెలల నుంచి జీతాలు చెల్లించక పోవడంతో కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. తొలుత ఈ నెల 2న కార్మికులు విధులు బహిష్కరించగా, పంచాయతీ కార్యదర్శి భూపతి రెడ్డి 5వ తేదీన కార్మికులందరికీ జీతాలు ఇస్తాం, విధులకు హాజరు కావలెనని కోరారు. దీంతో వారు విధులకు హాజరయ్యారు. 7వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించకపోవడంతో శుక్రవారం నుంచి విధులు బహిష్కరించారు. పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాల్సిన అలవెన్స్‌లు కూడా ఇవ్వడం లేదన్నారు.

సర్వే సక్రమంగా చేయాలి



కర్లపాలెం: సర్వే సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం ఎంపీడీవో దమ్మనవారిపాలెం, బుద్దాం గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే జరుగుతుందని చెప్పారు. 18వ తేదీకి సర్వే పూర్తి చేయాలని తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు సేవలు

జిల్లా అధికారి మట్టా జ్యోత్స్న



చుండూరు(వేమూరు): దివ్యాంగులకు భవిత కేంద్రాల ద్వారా అనేక సేవలు అందించడం జరుగుతుందని భవిత కేంద్రం జిల్లా అధికారి మట్టా జ్యోత్స్న అన్నారు. చుండూరు మండలంలోని మున్నంగి వారి పాలెం భవిత కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ప్రతి రోజు భవిత కేంద్రానికి వచ్చి సేవలు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రభుత్వం అనేక రకాలు అలవెన్స్‌లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయుడు భాస్కర్ సాగర్, కె.శివకుమారి, ఎం.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవే వాసవీ క్లబ్ వనిత లక్ష్యం

వాసవీ క్లబ్ వనిత జోన్ చైర్‌పర్సన్ హారిక



రేపల్లె రూరల్: సమాజ సేవా కార్యక్రమాలే ధ్యేయంగా తమ వాసవీ క్లబ్ వనిత ముందుకు నడుస్తోందని వాసవీ క్లబ్ వనిత జోన్ చైర్‌పర్సన్ కాశేపల్లి హారిక అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రేపల్లె వాసవీ క్లబ్ వనిత కార్యాలయంలో ఆమె స్నేహపూర్వక పర్యటన చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో పాటు మహిళా చైతన్య కార్యక్రమాలు నిర్వహించటం, తిరునాళ్ళు, పుష్కరాలు వంటి కార్యక్రమాలలో భక్తులకు, ప్రజలకు సేవలు అందించటం, విపత్తుల సమయంలో తమ వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించటం, పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయటంతో పాటు అనాథలకు తమ సంస్థ సహకారం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా రేపల్లె క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం క్లబ్ సభ్యులతో కలిసి ఎయిమ్స్ ఫర్ సేవా సంస్థలో ఆశ్రయం పొందుతున్న అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అధ్యాపకురాలు లక్ష్మణ మల్లీశ్వరి, డ్యాన్స్ టీచర్ వేదాంతం వెంకట దుర్గాభవానీలను సత్కరించారు. మహిళలకు పలు రకాల ఆటల పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వాసవీ క్లబ్ వనిత అధ్యక్షురాలు నిడమానూరు నగరాజ కుమారి, కార్యదర్శి కారుమూరు నాగలీల, కోశాధికారి యెండూరి పద్మజ, ఆర్యవైశ్య మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మద్ది పద్మజ, పొన్నూరు గౌరీరామకుమారి పాల్గొన్నారు.

అన్నింటా.. ఆమె

- పలు చోట్ల మహిళా దినోత్సవ వేడుకలు
- మహిళా ఉద్యోగులకు సత్కారాలు

రేపల్లె రూరల్: పాలనలో... సేవలో... బాధ్యతలు నిర్వర్తించటంలో... ఇలా ఆమె గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అందుకే మహిళ ఆనందంగా ఉంటే ఆ ఇల్లు స్వర్గం... ఆమె దిగాలుగా ఉంటే ఆ ఇల్లు నరకంగానూ ఉంటుందని అనేక మంది కవులు, పెద్దలు పేర్కొన్నారు. ఒకప్పుడు కేవలం వంటింటికే పరిమితమైన మహిళ నేడు ఆకాశాన్ని చుట్టి వచ్చేస్థాయికి చేరుకుంది. పురుషులతో సమానంగా నేడు అన్ని రంగాల్లో స్త్రీలు రాణిస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా...

స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలు



ఉపాధ్యాయురాలిగా, ప్రధానోపాధ్యాయురాలిగా తనదైన శైలిలో విద్యాబోధన చేసి అందరి మన్ననలు పొందారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారాన్ని 2015లో దక్కించుకున్నారు. భర్త ప్రసాద్ ప్రోత్సాహంతో ఉపాధ్యాయ వృత్తితో పాటు సమాజ సేవలో తన ప్రస్తానం ప్రారంభించారు. 2005లో మదర్ థెరిస్సా మహిళా యునెస్కో క్లబ్ స్థాపించి అనాథ చిన్నారులకు చేయూతనివ్వటం, పలు రంగాల్లో నిష్ణాతులైన మహిళలను గుర్తించి సత్కరించటం వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. 2013లో మదర్‌థెరిస్సా మహిళా యునెస్కో క్లబ్ బెస్ట్ డైరెక్టర్‌గా అవార్డును పొందారు.

– దాసరి ఝాన్సీ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు, రేపల్లె

ఎనిమిదిసార్లు పురస్కారాలు



గ్రూప్-2లో ఎంపికై 1993లో ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టి అనేక మండలాల్లో తనదైన శైలిలో ఆయా మండలాలను అభివృద్ధి చేసి చురుకుగా విధులు నిర్వర్తిస్తూ ఎనిమిదిసార్లు ఉత్తమ ఎంపీడీవోగా పురస్కారాలను అందుకున్నారు. కృష్ణా జిల్లా శ్రీకాకుళం గ్రామానికి చెందిన శోభారాణి రైతు కుటుంబంలో జన్మించి అనేక ఆటంకాలను ఎదుర్కొని ఎంపీడీవోగా ఎంపికై ఆ ప్రాంత విద్యార్థినులకు ఆదర్శంగా నిలిచారు. 2016లో కృష్ణా పుష్కరాలలో పెనుమూడి గ్రామంలో సేవలకు అలాగే 2025లోను రిపబ్లిక్ డే రోజున జిల్లా కలెక్టర్ల చేతుల మీదగా పురస్కారాలు పొందారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటేనే విజయం సునాయసమవుతుందని సందేశాన్నిచ్చారు. – ఎం.శోభారాణి, ఎంపీడీవో, రేపల్లె

ప్రత్యేక అవసరాల చిన్నారులు సేవలో



భవిత స్కూల్ స్పెషల్ ఎడ్యుకేటర్‌గా అనురాధ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు, దివ్యాంగులకు వారి అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నారు. తాము వైకల్యంతో బాధపడుతున్నామన్న భావాన్ని రానివ్వకుండా, ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. చిన్నారులు ఆహారం తీసుకునే సమయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ భోజనం సక్రమంగా తీసుకునేలా కృషి చేస్తున్నారు. ఆమె సేవలను గుర్తించి రేపల్లె భవిత సెంటరుకు 2017లో ఉత్తమ భవిత సెంటరుగా జిల్లా స్థాయిలో గుర్తింపు లభించింది.

– ఎస్.అనురాధ, భవిత స్కూల్ స్పెషల్ ఎడ్యుకేటర్, రేపల్లె

బాలికలు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు

రేపల్లె రూరల్: బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని తమ గమ్యాన్ని చేరుకోవాలని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.కోటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏబీఆర్ డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. మహిళలు మానసికంగా ఎంతో శక్తివంతులని, అనాదిగా మహిళలు తమదైన శైలిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. రచయితలుగా, శాస్త్రవేత్తలుగా, సామాజికవేత్తలుగా రాణించటమే కాకుండా తమ కుటుంబాలను సైతం బాధ్యతాయుతంగా నడిపించగల శక్తి సామర్థ్యాలు ఉన్నవారన్నారు. కళాశాలలో చదువుతున్న బాలికలు ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.భాస్కరరావు, సుభాషిణి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఏబీఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి : ఎస్ఐ



విద్యార్థినులకు సూచనలిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు

నిజాంపట్నం: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని నిజాంపట్నం ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన నిజాంపట్నంలో జెడ్పీహైస్కూలు విద్యార్థినులకు శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రక్షణ, సేవా, ఉపాధి ప్రతి రంగంలోనూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. విద్యార్థినులు తమకు అందవచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా పలు రంగాలలో రాణించిన పలువురి మహిళల జీవిత కథల ఆధారంగా తీసిన చిత్రాలలో పలు అంశాలను బాలికలకు ప్రదర్శన రూపంలో వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా వైద్యాధికారి డాక్టరు విజయమ్మ

బాపట్ల: ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టరు విజయమ్మ పేర్కొన్నారు. బాపట్ల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. మహిళలకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టరు విజయమ్మ మాట్లాడుతూ మహిళలకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలపై వెంటనే పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు. ప్రతి ఒక్కరు పౌష్టిహాకారం తీసుకోవాలని తెలిపారు. ఎస్‌బీఐ ఒంగోలు రీజనల్ మేనేజర్ గున్నేశ్వరరావు, స్టేట్ బ్యాంకు చీఫ్ మేనేజర్ వర్ల ఆనందబాబు మాట్లాడుతూ బాపట్ల ఎస్‌బీఐ ప్రతి ఏడాది రూ.800 కోట్ల టర్నవర్ చేస్తుందని, ఈ ఏడాది రూ.1,000 కోట్లు లక్ష్యంగా ముందుకు పోతుందని తెలిపారు. ఎస్‌బీఐ మహిళా ఖాతాదారులకు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు యజ్ఞ శ్రీకాంత్, డాక్టరు సిదార్థ, ఉప్పాల విద్యాసాగర్, బెల్లంకొండ మాధవి, సుజాత, అవంతి, ప్రియాంక, పవన్ తిరువీధుల వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ పూనూరి అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టరు విజయమ్మ

ఎస్‌బీఐ మహిళా ఖాతాదారులకు వైద్య శిబిరం

కొల్లూరు : మహిళా దినోత్సవాన్ని పునస్కరించుకొని మహిళా ఖాతాదారులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం కొల్లూరు ఎస్‌బీఐ శాఖలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కావ్యతేజ మహిళా ఖాతాదారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఖాతాదారులలో 66 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ ఆర్.రమేష్ తెలిపారు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైన చికిత్స పొందాలన్నారు. కుటుంబ భారాన్ని మోసే మహిళలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది కేవీ విజయలక్ష్మి, పి.శ్రీనివాసరావు, సీహెచ్ జ్యోతి, ఎం.కిర్మణ్మయి, కేఎం జోస్పెన్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు వైఎస్సార్‌సీపీకి వెన్నెముక

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజలను చైతన్య వంతులను చేయడంలో గ్రామ కమిటీలు వైఎస్సార్‌సీపీకి వెన్నెముకలా వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని బొద్దులూరుపాడు, త్రాప గ్రామాలలో నూతన గ్రామ కమిటీల ఎంపికలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ భవిష్యత్తులో చేపట్టనున్న ప్రజా పోరాటాలతోపాటు, పార్టీ కార్యకలాపాలను విస్తృత పరచడానికి గ్రామ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ ముందడుగు వేయనున్నదన్నారు. గ్రామ కమిటీలు కూటమి ప్రభుత్వం, ఆయా పార్టీల నాయకుల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. పార్టీ కార్యకలాపాలను ప్రజలలోకి తీసుకొని వెళ్లడం ద్వారా ప్రజలకు గత ప్రభుత్వంలో చేకూరిన లబ్ధిని వివరించడంతోపాటు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తున్న తీరును తెలియజేయాలన్నారు. అమాయక ప్రజలను, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇబ్బందులకు గురిచేస్తే సహించే ప్రసక్తే లేదని, వైఎస్సార్‌సీపీ తరపున వారికి న్యాయం చేయడానికి తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని భరోసా కల్పించారు. బొద్దులూరుపాడులో గ్రామ పార్టీ అధ్యక్షుడిగా బొర్రా సాంబశివరావు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతనంగా ఎంపికైన గ్రామ కమిటీ సభ్యులను వరికూటి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు, సర్పంచి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు గుర్రం మురళి, ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, మాజీ సర్పంచి కట్టుపల్లి సోమయ్య, నాయకులు గుర్రం వెంకటేశ్వరరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పవన్, గోపికృష్ణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతన గ్రామ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె రూరల్: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. అంగన్‌వాడీల సమస్యల సాధనకై ఈ నెల 10న విజయవాడలో ధర్నా నిర్వహించనున్న నేపథ్యంలో రేపల్లె ఐసీడీఎస్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీడీపీవో ఎం.సుచిత్రకు వినతిపత్రం శుక్రవారం అందజేసి అనంతరం మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీల వేతనాలు పెంపుదల చేయాలన్నారు. గ్రాడ్యుటీకి స్పష్టతతో కూడిన జీవోను, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ జీవో ఇవ్వాలన్నారు. వర్కర్‌లు, హెల్పర్‌లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్పర్‌లకు ప్రమోషన్ గైడ్‌లైన్స్ రూపొందించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలన్నారు. 164 సూపర్‌వైజర్ పోస్టులు ఇవ్వాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని అన్నారు. మే నెలలో మినీ వర్కర్‌లకు సెలవులు ఇవ్వాలని తదితర సమస్యల సాధనకు విజయవాడలో ఈ నెల 10న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ధర్నాలో అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీడీపీవో సుచిత్రకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజలను మోసగించి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం

సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

కొల్లూరు: కూటమి ప్రభుత్వం మోసపూరితమైన అబద్ధపు వాగ్దానాలు చేసి ప్రజలను మోసగించి గద్దెనెక్కిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. శుక్రవారం కొల్లూరు ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పేరు చెప్పుకొని గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం నేటికీ ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను మోసం చేయడానికి విఫలయత్నం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఏ ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు చేరువ కాలేదని, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని ప్రగల్భాలు పలుకుతూ అధికారంలోకి వచ్చి ఏ ఒక్క సంక్షేమ పథకానికి కూడా సంపూర్ణంగా నిధులు కేటాయించకపోగా, ప్రజలను మభ్యపెట్టి మోసగించే ఆలోచనలో ఉందన్నారు. ఇసుక రీచ్‌లలో కూలీలతో ఇసుక లోడింగ్ చేయించకుండా యంత్రాలతో చేయిస్తుండటం కారణంగా కూలీలకు పనులు కరవయ్యాయన్నారు. ఉపాధి హామీ పథకం పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం అవకపోవడంతో ఇతర ప్రాంతాలకు కూలీలు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వ అధికారులు స్పందించి కూలీలతో ఇసుక లోడింగ్ చేయించడంతోపాటు, గ్రామాలలో పూర్తి స్థాయిలో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8 నుంచి 28 వరకు జరగనున్న ప్రచార యాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, కొల్లూరు మండల కార్యదర్శి వెంకట్రామయ్య, కమిటీ సభ్యులు నాగమల్లేశ్వరరావు,సురేష్,సుబ్బారావు పాల్గొన్నారు.

ఏడీఈగా శ్యామ్‌సుధాకర్ బాబు బాధ్యతల స్వీకరణ

రేపల్లె రూరల్: విద్యుత్ శాఖ ఏడీఈగా డి.శ్యామ్ సుధాకర్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చెరుకుపల్లి ఏడీఈగా పనిచేస్తూ సాధారణ బదిలీపై రేపల్లె విచ్చేశారు. ఇక్కడ ఏడీఈగా పనిచేసిన సురేష్‌బాబు బాపట్లకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన శ్యామ్ సుధాకర్‌బాబుకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలంలోని మోర్లవారిపాలెం, పేటేరు, పెనుమూడి, పోటుమెరక, గంగడిపాలెం, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ, బొబ్బర్లంక, చోడాయపాలెం, పిరాట్లంక పంచాయతీలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చుండూరు(వేమూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు దోనేపూడి అర్జునరావు తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు, పెనుమద్రపాడు ఫీడర్ పరిధిలోని శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కొల్లూరు : విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం పలు విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లనున్నట్లు ఏఈ కె.సుధాకర్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఈపూరులంక సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సుగ్గునలంక, చిలుమూరులంక, ఈపూరులంక, చింతర్లంక, పెదలంక, అన్నవరపులంక, కనిగిరిలంక గ్రామాలు, కొల్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని దోనేపూడి ఫీడర్ మరమ్మతుల వల్ల దోనేపూడి, కోటిపల్లి, చినపులివర్రు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

చెరుకుపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించి మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 8వ తేదీ శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం డాక్టర్ ఈవూరు గణేష్ డాక్టర్ కేశవతి ఆధ్వర్యంలో గుళ్ళపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని కావున నియోజకవర్గంలోని మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

పురుగు మందుల వినియోగంలో జాగ్రత్త వహించాలి

బాపట్ల: చేలకు పురుగు మందులను వెదజల్లే క్రమంలో రైతులు జాగ్రత్త వహించాలని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు పి.ప్రసూనరాణి పేర్కొన్నారు. మందులు వెదజల్లేటప్పుడు వ్యక్తిగత భద్రత వస్త్రాలను ధరించాలని సూచించారు. వ్యవసాయ కళాశాల కీటక శాస్త్ర విభాగంలో జరిగిన పురుగు మందుల వినియోగ పద్ధతులు, వాటి సురక్షిత వాడకంపై నిర్వహించబడిన శిక్షణ శిబిరంలో ఆమె రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రైతులకు వ్యక్తిగత భద్రత రక్షణ భద్రతా వస్త్రాలను ఒక కిట్టుగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నిధుల వినియోగ సమన్వయకర్త డా. కె.సుశీల మాట్లాడుతూ రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన మృత్యువాత పడుతున్నారని తెలిపారు. కీటక శాస్త్ర విభాగ అధిపతి డా.ఎస్.ఆర్.కోటేశ్వరరావు పురుగు మందులు వాడే విధానంలోని పలు అంశాలను రైతులకు వివరించారు. రిసోర్స్‌పర్సన్ డా. పి.సుధా జాకబ్, రీచ్ ఎస్.జి.ఓ. ప్రతినిధులైన దివ్య, కీటక శాస్త్ర విభాగ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణగ్రహీతలైన రైతులకు కష్టాలు

- అప్పులు చెల్లించేందుకు లేని అవకాశం
- అందుబాటులో లేని అధికారులు
- పెదగాదెలవర్రు సొసైటీలో దుస్థితి



పెదగాదెలవర్రు సొసైటీ భవనం

పెదగాదెలవర్రు(తెనాలి): తెనాలి సమీపంలోని బాపట్ల జిల్లా చుండూరు మండల గ్రామం పెదగాదెలవర్రులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో రుణాలు తీసుకున్న రైతులకు అగమ్యగోచర పరిస్థితి ఏర్పడింది. సొసైటీ కార్యదర్శిగా పనిచేస్తున్న శివారెడ్డి అనారోగ్యం కారణంగా నెలరోజులు సెలవుపై వెళ్లారు. స్వస్థత చేకూరని పరిస్థితిలో మరో నెల రోజులు సెలవును పొడిగించారు. సొసైటీలో సూపర్‌వైజర్ కూడా అందుబాటులో లేరు. నెలాఖరుతో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనున్న తరుణంలో సొసైటీలో కీలక అధికారులు లేకపోవటంతో రైతులకు రుణాలకు చెల్లించటం ప్రశ్నార్థకంగా మారింది. పెదగాదెలవర్రు పేరుతో(డీఆర్ నెం.340)గల సొసైటీ వాస్తవంగా సమీపంలోని చినగాదెలవర్రులో ఉంది. ఈ సొసైటీ నుంచి రైతుల బకాయిలు రూ.16 కోట్ల వరకు ఉన్నాయి. దీర్ఘకాలిక రుణాలు రూ.6 కోట్లు, పంట రుణాలు రూ.4.16 కోట్లు, ఓల్డ్ సీసీ రుణాలు 1.20 కోట్లు, స్వల్పకాలిక రుణాలు రూ.4.70 కోట్ల చొప్పున రైతులు తీసుకున్నారు. హెచ్చుశాతం రుణాలను మార్చి నెలాఖరులోగా సొసైటీకి తిరిగి చెల్లించాల్సి ఉంది. బకాయిలు వసూలు చేసుకుని రసీదులు ఇవ్వాల్సిన సూపర్‌వైజర్ లేకపోవటం, కార్యదర్శి సెలవులో ఉండటంతో రుణాలను ఎవరికి జమ చేయాలో అంతుపట్టని సమస్యగా మారింది. సెలవు పెట్టిన కార్యదర్శి స్థానంలో వేరొకరికి ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మార్చి నెలాఖరులోగా రుణాలు జమ చేయకపోతే తమపై అధిక వడ్డీల భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు.